**ఆకాశవాణి**

**హైదరాబాదు కేంద్రం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ : 23.06.2017** **సమయం : 1815 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1) స్మార్ట్‌సిటీ మిషన్ కేంద కేంద్రప్రభుత్వం ఈరోజు ప్రకటించిన జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, తెలంగాణలోని కరీంనగర్ కూడా ఉన్నాయి.**

**2) శ్రీహరికోట నుంచి PSLV C-38 రాకెట్‌ను ఇస్రో ఇవాళ విజయవంతంగా ప్రయోగించింది. వచ్చే ఏడాది 8 నుంచి 10 PSLV, 2 GSLV రాకెట్ల ప్రయోగానికి ప్రణాళికను సిద్ధంచేస్తున్నట్టు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ AS.కిరణ్‌కుమార్ తెలిపారు.**

**3) సిడ్నీలో జరుగుతున్న ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్ కిదాంబి శ్రీకాంత్ సెమీఫైనల్స్‌కు చేరుకున్నారు.**

**4) కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో రానున్న ఐదురోజుల్లో తేలికపాటి వర్షాలు, ఒక మోస్తరు నుంచి భారీ జల్లులు పడే అవకాశం ఉంది.**

***************

స్మార్ట్‌సిటీ మిషన్ కింద మరో 30 నగరాలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయనున్నట్టు కేంద్రప్రభుత్వం ఇవాళ ప్రకటించింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, తెలంగాణలోని కరీంనగర్ కూడా ఉన్నాయి. తాజా జాబితా ప్రకటనతో దేశవ్యాప్తంగా స్మార్ట్ సిటీలుగా రూపొందే నగరాల సంఖ్య 90కి చేరింది. దేశంలో 100 నగరాలను స్మార్ట్ సిటీలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 2015లోనే స్మార్ట్ సిటీ మిషన్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యానాయుడు ఇవాళ న్యూఢిల్లీలో తాజాగా ఎంపికచేసిన 30 నగరాల పేర్లను ప్రకటించారు. ఈ ఎంపికలో 40 నగరాలకు స్థానం ఉండగా... 45 నగరాలు పోటీపడినప్పటికీ 30 మాత్రమే ఎంపికయ్యాయని ఆయన వివరించారు.

ఇదిలాఉండగా... కరీంనగర్ పట్టణాన్ని స్మార్ట్‌సిటీస్ కింద ఎంపిక చేసినందుకు తెలంగాణ పురపాలక శాఖ మంత్రి K.తారక రామారావు - కేంద్రమంత్రి వెంకయ్యానాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా తారక రామారావు విలేకరులతో మాట్లాడుతూ... అన్ని నగరాలకు కేంద్రం ఒకేరీతిలో నిధులు కేటాయించడం సరికాదన్నారు. మెట్రో, కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయతీలను విభజించి నిధులు కేటాయించాలని మంత్రి - కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.
మరోవైపు - కరీంనగర్ స్మార్ట్ సిటీగా ఎంపిక కావడంతో కరీంనగర్ వాసులు హర్షం వ్యక్తంచేశారు. బాణాసంచా పేల్చి.. డప్పులు వాయిస్తూ ప్రజలు మిఠాయిలు పంచుకున్నారు.

**************

వచ్చే ఏడాది నుంచి నిర్వహించబోయే రాకెట్ ప్రయోగాలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో ఛైర్మన్ AS.కిరణ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా 8 నుంచి 10 PSLV రాకెట్లను, రెండు GSLV రాకెట్లను ప్రయోగించాలన్నది లక్ష్యమని తెలిపారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఇవాళ PSLV C-38ను విజయవంతంగా ప్రయోగించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాణిజ్య సరళిలో విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టడంపై ఇస్రో దృష్టిసారిస్తున్నదని, దీనివల్ల దేశానికి కూడా ఆదాయం వస్తుందని చెప్పారు. కాగా - ఈ నెల 28వ తేదీను ఫ్రెంచి గయానా నుంచి ఏరియన్ రాకెట్ ద్వారా GSAT-17 ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్టు ఆయన చెప్పారు. సమాచార ఉపగ్రహాలకు డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా వీటి ప్రయోగానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కిరణ్‌కుమార్ చెప్పారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది జీశాట్-11ను శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తామన్నారు. దేశంలో నావిగేషన్ వ్యవస్థ అవసరాలు తీర్చేందుకు ప్రయోగించిన IRNSS 1A ఉపగ్రహంలో సాంకేతిక సమస్య తలెత్తిందని కిరణ్‌కుమార్ వెల్లడించారు. దీని స్థానంలో మరొక ఉపగ్రహాన్ని వచ్చే నెలలో ప్రయోగిస్తామని తెలిపారు. అలాగే చంద్రయాన్-2, ఆదిత్య ఉపగ్రహాల ప్రయోగానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని చెప్పారు. కాగా - ఇవాళ ఉదయం 9 గంటల 29 నిముషాలకు నింగికి దూసుకెళ్లిన PSLV C-38 రాకెట్ 31 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇస్రో శాస్త్రవేత్తలను అభినందించారు. ఇస్రో సాధిస్తున్న విజయాలు భారతదేశానికి గర్వకారణమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు.

**************

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలకు రాష్ట్రపతి ఆమోదం లభించిన నేపథ్యంలో తెలంగాణలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇవాళ ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిని కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో శాసనమండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పూల రవీందర్, K.జనార్ధన్‌రెడ్డితో పాటు... PRTU, UTF సంఘాలకు చెందిన నాయకులు ఉన్నారు.

**************

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం చన్వెల్లి గ్రామంలో నిన్న బోరుబావిలో పడిపోయిన ఏడాదిన్నర బాలికను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు ఘటనా ప్రాంతంలో మకాంవేసి చిన్నారిని రక్షించేందుకు తీవ్రప్రయత్నం చేస్తున్నారు. అయితే - అడపాదడపా కురుస్తున్న వర్షాలు సహాయక చర్యలకు విఘాతం కలిగిస్తున్నాయి. బోరుబావికి సమీపంలో సమాంతర గోతిని తవ్వుతున్నారు. మరోవైపు - బోరుబావిలోకి వైద్యులు ఆక్సిజన్ పంపిస్తున్నారు. రవాణ మంత్రి మహేందర్‌రెడ్డి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**************

జాతీయ ప్రజాస్వామ్య కూటమి-NDA అభ్యర్ధిగా రాష్ట్రపతి పదవికి పోటీచేస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఇవాళ పార్లమెంట్ భవంలోని ఎన్నికల కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు, NDA భాగస్వామ్య పార్టీల నాయకులు పలువురు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు K.చంద్రశేఖర్‌రావు, N.చంద్రబాబునాయుడు కూడా ఇందులో పాల్గొన్నారు. నామినేషన్ల దాఖలు గడువు ఈ నెల 28వ తేదీతో ముగుస్తుండగా.. ప్రతిపక్ష అభ్యర్ధి మీరాకుమార్ 27వ తేదీన నామినేషన్ దాఖలుచేస్తారని సమాచారం.

**************

పాస్‌పోర్ట్‌లను ఇకపై హిందీలో కూడా ముద్రిస్తామని విదేశాంగ శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రకటించారు. ఇప్పటివరకు ఇంగ్లీష్‌లోనే పాస్‌పోర్టులు ముద్రిస్తున్నట్లు ఆమె గుర్తుచేశారు. ఇకపై ఎనిమిదేళ్ల లోపు, 60 ఏళ్లు పైగా వయస్సున్న దరఖాస్తుదారులకు పాస్‌పోర్టు రుసుమును 10 శాతం తగ్గిస్తున్నట్టు మంత్రి తెలిపారు. పాస్‌పోర్ట్ చట్టం-1967 అమల్లోకి వచ్చి 50 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఢిల్లీలో ఇవాళ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ ప్రకటన చేశారు.

**************

తెలంగాణలో మహిళలందరికీ రక్షణ కల్పించే దిశగా పోలీసు విభాగంలోని 'షీ' బృందాలను రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు విస్తరిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ఇవాళ నిర్వహించిన వితంతువుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వితంతువుల సమస్యలపై శాసనసభలో చర్చిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అధిక సంఖ్యలో బాల్యవివాహాలు, పురుషులు మద్యపానానికి బానిసలు కావడం వంటి కారణాల వల్ల రాష్ట్రంలో వితంతువుల సంఖ్య పెరుగుతోందని విచారం వ్యక్తంచేశారు.

**************

ఉత్తర బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది ఒడిశా నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు విస్తరించి ఉంది. దీనికితోడు నైరుతీ రుతుపవనాలు తెలంగాణలో చురుగ్గా ఉన్నాయి. వీటన్నింటి ప్రభావంతో రాబోయే ఐదురోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం, ఒక మోస్తరు నుంచి భారీ జల్లులు పడే అవకాశం ఉంది. ఇదిలాఉండగా... హైదరాబాద్‌లో ఈ ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురుస్తోంది.

**************

తెలంగాణలోని జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన రచయిత వాసల నరసయ్యకు బాలసాహిత్యంలో విశేషం కృషికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తంచేశారు. బాలల కోసం అనేక పుస్తకాలు వెలువరించడంతో పాటు.. వందలకొద్దీ కథలు రాసిన నరసయ్య ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి అన్నివిధాలా అర్హులని ఇవాళ విడుదల చేసిన ఒక సందేశంలో ప్రశంసించారు. అలాగే యువతరం విభాగంలో సాహిత్య అకాడమీ పురస్కారం దక్కించుకున్న మెర్సీ మార్గరెట్‌ను కూడా ముఖ్యమంత్రి అభినందించారు.

**************

సిడ్నీలో జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత షట్లర్ కిదాంబి శ్రీకాంత్ ఇవాళ సెమీఫైనల్స్‌లో ప్రవేశించారు. అందరినీ ఆకర్షించిన క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లో సహ అటగాడు B.సాయిప్రణీత్ 25-23, 21-17 స్కోరుతో వరుస సెట్లలో ఓడించాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో PV.సింధు, సైనానెహ్వాల్ తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓటమి పాలయ్యారు.

**************